విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ అందజేత

మంగళగిరి టౌన్: త్వరలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళగిరి నగర పరిధిలోని కేకే మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఎగ్జామ్ కిట్స్ అందజేశారు. వినుకొండకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు వేములపాటి లక్ష్మీ సామ్రాజ్యం, నాగేంద్ర దంపతులు వీటిని వితరణ చేశారు.

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షలు రాసేందుకు ప్యాడ్‌లను అందజేశారు.

15 నుంచి వాలీబాల్ పోటీలు

మంగళగిరి టౌన్: సమ్మర్ వాలీబాల్ క్యాంప్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16వ తేదీల్లో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, విజేతలకు బహుమతులు ఉంటాయని తెలిపారు.

మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు (సీనియర్ డివిజన్)

E.P. No : 27/2023 IN O.S.No : 2/2013

పిటీషన్ : 1) కోట వెంకటేశ్వర్లు (Died)
2) కోట ప్రసాదరావు, S/o. లేట్ వెంకటేశ్వర్లు
3) కోట [illegible], S/o. లేట్ వెంకటేశ్వర్లు
D.H.R's

మరియు

1) కొడాలి జనమేశ్వరమ్మ (Died)
2) తలకోల రామకృష్ణారెడ్డి, S/o. సంగారెడ్డి, [illegible] గ్రామము, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా.
3) కొడాలి సుబ్బారావు, S/o. సత్యనారాయణ, [illegible] గ్రామము, మేడికొండూరు మండలం, గుంటూరు జిల్లా.
4) కొడాలి [illegible], S/o. సుబ్బారావు, [illegible] గ్రామము, మేడికొండూరు మండలం, గుంటూరు జిల్లా.
5) కొడాలి స్వర్ణలత, D/o. సుబ్బారావు, [illegible] గ్రామము, మేడికొండూరు మండలం, గుంటూరు జిల్లా. J.D.R's

[illegible] EP [illegible] 2 నుండి 5 నెంబర్లు JDR's [illegible] D.H.R's [illegible] EP దాఖలు చేసి ఉన్నారు.

[illegible] EP [illegible] 21 రూలు 34 [illegible] EP ని 04.04.2025 వ తేదీకి వాయిదా వేసియున్నారు.

[illegible] 2 నుండి 5 నెంబర్లలో గల JDR లు ది.04.04.2025 వ తేదీన ఉదయం 10 గంటలకు [illegible] EP ని [illegible] తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

సత్తెనపల్లి ది.13.03.2025 — [illegible] వెంకటేశ్వర రావు, [illegible] వేణుగోపాల రావు ... తరఫున న్యాయవాదులు, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా. సెల్: 91338 13357

అబద్ధపు హామీలతో అధికారంలోకి చంద్రబాబు

- హామీలు నెరవేర్చకపోతే త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారు
- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో సమన్వయకర్త వేమారెడ్డి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు ఆ ప్రజలే బుద్ధి చెబుతారని పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన వేమారెడ్డి మాట్లాడుతూ... పార్టీ పెట్టినప్పటి నుంచి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. పార్టీకి పోరాటం కొత్త కాదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలోను, హామీలను అమలు చేయడంలోనూ ఘోర వైఫల్యం చెందిన చంద్రబాబుపై పోరాటం తప్పదన్నారు. అధికారంలో ఉండగా ఏ పార్టీ చేయని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేసిన ఘనత వైఎస్సార్ సీపీది అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, సుస్థిర అభివృద్ధి సాధించడం ద్వారా దేశంలోనే రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే పార్టీ లక్ష్యమన్నారు. యువతకు భృతి, ఉద్యోగకల్పన పేరిట చంద్రబాబు మోసగించారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈపూరి ఆదాం, నాలి వెంకటకృష్ణ, షేక్ సుభాని, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, ఫిరోజ్, జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నియోజకవర్గ మహిళా కమిటీ అధ్యక్షురాలు సలోమి, పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత, మాబు, సాలి ప్రశాంత్, కురగంటి ప్రేమ్, తాడిబోయిన సురేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం దుగ్గిరాల రైలుపేటలోని వైఎస్సార్ విగ్రహం దగ్గర బుధవారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు. మండల అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధిని అందించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచారన్నారు. కార్యక్రమం అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. జి.గంగాధరరావు, ఎస్.నాగేశ్వరరావు, యు.ఆనంద్‌బాబు, ఎస్.రత్నం, కె.సుమన్, ఎస్.కోటేశ్వరరావు, సంసోనమ్మ, ఎస్‌కె.జానీబాషా, ధనుంజయ్, శ్యామూల్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు

తాడేపల్లి రూరల్ : రానున్న కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాటానికి సిద్ధం కావాలని, ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడేందుకుని సిద్ధం చేయాలని వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని దొంతిరెడ్డి అంజిరెడ్డి భవన్ వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం అంజిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా కొత్తూరులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలు మాట్లాడుతూ... వైఎస్ జగన్ ప్రతి ఎన్నికల పోరులోనూ ఒంటరిగా బరిలోకి దిగి విజయం సాధించారని అన్నారు.

ఉండవల్లిలో....

ఉండవల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ ఉండవల్లి అధ్యక్షులు దంటు గోవర్ధన రెడ్డి బుధవారం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళ్ళం పిచ్చిరెడ్డి, మున్నంగి వీర శ్రీధర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కళ్ళం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు



తాడేపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య

ప్రజలతోనే వైఎస్సార్ సీపీ ప్రయాణం

- వెన్నంటి నడిచిన శ్రేణుల ధైర్యం మరువలేనిది
- తాడికొండలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజలతోనే ప్రయాణం చేస్తోందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. బుధవారం పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరు మల్లికార్జునపేట 5వ లైనులోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరంతర శ్రమ, ప్రజల కష్టాలను తెలుసుకొనేందుకు చేసిన పాదయాత్రతో ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయలేక చతికిలపడటం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జనరంజక పాలన అందించారు. ప్రతి పేదవాడి కష్టంలోనూ తోడుగా నిలిచినందునే ప్రజాదరణ మెండుగా ఉందన్నారు. వెన్నంటి నడిచిన ప్రతి కార్యకర్త, నాయకుడికి భవిష్యత్తులో ఉన్నత స్థానం ఉంటుందని చెప్పారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీలు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం చేయలేకపోతున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోతోందని మండిపడ్డారు. పేదవాడికి విద్యను దూరం చేస్తూ ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను నిర్వీర్యం చేసి పేదలకు విద్య అందని ద్రాక్షగా మిగిల్చిన బాబుకు ప్రజాగ్రహం చవిచూడక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ముఖ్య నాయకులు ఫిరంగిపురం జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు దాసరి రాజు, చిట్టా అంజిరెడ్డి, చేవూరి రామ్మోహనరెడ్డి, ముప్పాళ్ళ మనోహర్, తాళ్ళూరి వంశీ, తాళ్ళ శివనాగరాజు, షేక్ సలీమ్, వంగా పోలారెడ్డి, దానం వినోద్, మల్లంపాటి రాఘవరెడ్డి, చుండు వెంకటరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, షేక్ అబ్బాస్, తుమ్మూరు రమణారెడ్డి, బెజ్జం రాంబాబు, బాకి వెంకటస్వామి, గుంటి రఘువరన్, పాములపాడు సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి టౌన్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా, మంగళగిరి పరిధిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగ సమస్యలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో రెగ్యులర్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కామన్ పీజీ సెట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ మధుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు.

కో ఆపరేటివ్ సొసైటీ శాఖ ప్రారంభం

దుగ్గిరాల: ది కాకతీయ మ్యూచువల్ ఎయిడెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ 11వ బ్రాంచిని దుగ్గిరాలలో బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా రిబ్బన్ కట్ చేసిన బ్రాంచి ఆరంభించారు. కార్యక్రమంలో డీఎల్ కాంతారావు, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పోలకంపాడు మూడు బొమ్మల సెంటర్ వద్ద ఓ ఆటో బుధవారం బోల్తా కొట్టడంతో ఆరుగురికి గాయాలు అయ్యాయి. మంగళగిరి - విజయవాడ వెళుతున్న ఆటో ఎదురుగా రాంగ్ రూట్‌లో ద్విచక్రవాహన చోదకుడు రావడంతో తప్పించబోయి నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆటో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. డ్రైవర్‌తోపాటు నలుగురు ప్రయాణికులకు, ఓ చిన్నారికి గాయాలయ్యాయి.

ద్విచక్ర వాహనం చోరీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి హరిజనవాడ కరకట్ట వెంబడి ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైందని బాధితుడు గద్దె అనిల్ తాడేపల్లి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన సాయానికి సంబంధించిన చెక్కులకు లబ్ధిదారులకు అందించారు. తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు బుధవారం వీటిని అందజేశారు. మహమ్మద్ మొహిద్దీన్, తుమ్మురు ఆదిలక్ష్మి, సూరగని నవ్య భారతి, వేముల భూలక్ష్మి, బత్తిన శ్రీనివాసరావు, నూడగల మౌనిక, షేక్ బాషాకు సాయం అందించారు.



కార్యక్రమంలో నాయకులు దారదాసు, ఇట్టా భాస్కర్, కేలి వెంకటేశ్వరరావు, మురళి, సాంబశివరావు, పోతాబత్తిన శ్రీనివాసరావు, పుష్పాంజలి, లావణ్య, రాము, తాడిబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు డిమాండ్



తాడేపల్లి రూరల్: అటవీ ప్రాంతంలో జీవిస్తున్న వారికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం తాడేపల్లి పట్టణంలో ప్రజా చైతన్య యాత్ర ప్రారంభించారు. అనంతరం ప్రజలతో మాట్లాడారు. రామయ్య కాలనీ, జగ్జీవన్‌రావు కాలనీ, లెనిన్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికలకు ముందు ఈ ప్రాంతాల్లో పర్యటించిన నారా లోకేష్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలతోపాటు పట్టాలు కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరగ వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, వేముల వెంకన్న, ఎస్‌కే జానీ, వేముల రమణ, వేణు, మణి, మేరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

వనమా బాల వజ్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలుస్తామని నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని వేమవరం, కండ్రిక గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అటువంటి పరిస్థితి లేదని చెప్పారు. ఎన్నికల వాగ్దానంలో చేసిన హామీలు ఏవీ నేటి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కార్యకర్తలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరపున అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచ్ ఎం.శివకుమారి, పి.శ్రీనివాసరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, షేక్ మస్తాన్ వలి, ఆర్. రంజన్ బాబు, కె.ప్రవీణ్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి, టి.కోటిరెడ్డి, కె.హనిమిరెడ్డి, టి.కృష్ణ, కె.రామారావు, వెంకటేశ్వర్లు, శివాంజనేయులు, రామయ్య పాల్గొన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన ఆస్ట్రేలియా ప్రతినిధి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీని బుధవారం ఆస్ట్రేలియా సిడ్నీలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ ప్రతినిధి డాక్టర్ సెబాస్టియన్ కుంట్జ్ సందర్శించారు. కేఎల్‌యూ విదేశీ సంబంధాల డీన్ డాక్టర్ కిషోర్ బాబు, రీసెర్చ్ విభాగ డీన్ ప్రొఫెసర్ బీటీ మాధవ్‌తో చర్చించారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



కార్మికులకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు 99 రోజుల నుంచి తమ సమస్యలను పరిష్కరించాలని దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సీఐటీయూ, సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు విమర్శించారు. బుధవారం దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె. ఆదినారాయణలు మాట్లాడుతూ.. ప్రభుత్వం సమస్యలను పరిష్కరిస్తామని ప్రచారం చేసుకుంటున్నా, నేటికీ స్పందించకపోవడం విడ్డూరమని అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, గురవయ్య, బాషా, మాణిక్యరావు, వై.సుబ్బారావు, సాంబయ్య, రమాదేవి, దుర్గాభవాని, రిబ్కా, సారమ్మ, ఇమాంబి, అంకయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలస బస్టాండు సమీపంలో ఉన్న షిర్డీ సాయినాథ స్వామి ఆలయ 23 వార్షికోత్సవం గురువారం నుంచి మూడురోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ వై.యల్లారెడ్డి బుధవారం తెలిపారు. 13న గణపతిపూజ, పుణ్యాహవాచనం, సహస్రదీపారాధన, నవగ్రహ ఆరాధన, అష్టదిక్పాలపూజలు వైఖానస ఆగమం ప్రకారం వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ, అర్చకులు ఎన్‌వీ నరసింహాచార్యులు నిర్వహిస్తారన్నారు. 14న విశేషపూజలు, హనుమాన్‌చాలీసా, సాయిబాబా చాలీసా పారాయణ పరవస్తు హనుమాన్ సూరి నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారని చెప్పారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

బండారుపల్లి(తాడికొండ): తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైందని తాడికొండ సీఐ కె. వాసు తెలిపారు. బండారుపల్లి మసీదు వద్ద ఈ మృతదేహం లభ్యమైందని వీఆర్వో మధుసూదనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరు వర్గాల మధ్య వివాదం

మాచర్ల : పట్టణంలోని పాతూరులో రెండు వర్గాల మధ్య వివాదం జరిగింది. బుధవారం రాత్రి పదో వార్డులో ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని మరో వర్గం వారు అడ్డగించారు. ఈనేపథ్యంలో వాగ్వివాదం జరిగింది. ఓ వర్గం దాడికి ప్రయత్నించగా, మరో వర్గం వారు సైతం దాడికి యత్నించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

నులకపేట చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేటలో ఉన్న చెరువును ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులకపేటలో చెరువులో మురుగునీరు కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి, నీళ్లు కలుషితం కాకుండా చూస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా చెరువును ఆక్రమించుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సీడ్ యాక్సిస్ రోడ్డుపై పచ్చదనం పెంచాలి



అధికారులతో మాట్లాడుతున్న లక్ష్మీ పార్థసారథి

తాడికొండ: అమరావతి రాజధానికి వెళ్లే సీడ్ యాక్సిస్ రోడ్డుపై పచ్చదనం పెంచాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్ పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి అధికారులను ఆదేశించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్-9 రోడ్డుపై బఫర్ జోన్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రచించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆమె వెంట ఏడీసీ జనరల్ మేనేజర్ కె శ్రీ హరిరావు, చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకరరావు, ఉద్యాన విభాగాధిపతి వీఎస్ ధర్మజ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దుగ్గిరాల: పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు నో బ్లడ్ చారిటబుల్ ట్రస్ట్ వైద్యులు ఐశ్వర్య అన్నారు. మండల కేంద్రంలోని దళితవాడలో ఉచిత మెడికల్ క్యాంప్ బుధవారం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ బి.కృపాళిని, డాక్టర్ ఐశ్వర్య, సిబ్బంది పాల్గొన్నారు.

220 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం -2 పరిధిలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. షుగరు, బీపీ, థైరాయిడ్ ఉన్న 220 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ఇళ్ల సమస్యలపై అర్జీల స్వీకరణ

తాడేపల్లి రూరల్: దశాబ్దాలుగా రైల్వే, ఫారెస్ట్, పీడబ్ల్యూడీ, కొండ పోరంబోకు భూముల్లో స్థిర నివాసం ఉంటున్న పేదల నుంచి సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తామని చెప్పిందని, దీనికి పట్టా కావాలని పేర్కొందన్నారు. ఈ భూముల్లో ఉంటున్న వారికి గత ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేశ్‌లు హామీ ఇచ్చినట్లు శాశ్వతంగా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రీ సర్వేకు సహకరించాలి

మేడికొండూరు: రీసర్వేకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సహకరించాలని మేడికొండూరు మండల ఇన్‌చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణ శంకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందితో రీసర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ఇంటి వద్దకు వెళ్లి పీ-4 సర్వే చేయాలన్నారు. అపోహలు వద్దని చెప్పారు. ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.

శ్రీవారి కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న టీటీడీ ఈవో జె.శ్యామలరావు

తాడికొండ: వెంకటపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న జరుగనున్న శ్రీనివాస కల్యాణానికి సంబంధించిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. వెంకటపాలెంలోని ఆలయ ప్రాంగణంలో బుధవారం టీటీడీ అధికారులు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలిసి ఆయన గుంటూరు జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శ్యామలరావు మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణంపై సమీప గ్రామాల్లో టీటీడీ ప్రచారం రథం ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా కల్యాణ వేదిక పరిసరాల్లో అవసరమైన గ్యాలరీలు, క్యూలైన్‌లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయం, కల్యాణ వేదిక పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు చేపట్టాలన్నారు. భక్తులు సులభతరంగా స్వామిని దర్శించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కల్యాణానికి భజన బృందాలు, శ్రీవారి సేవకులను పెద్ద ఎత్తున ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లా, టీటీడీ అధికారుల కోసం ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సులువుగా వచ్చేందుకు వీలుగా తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వామి కల్యాణాన్ని నేరుగా చూడలేని లక్షలాది మంది భక్తుల సౌలభ్యం కోసం ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. వేదిక పరిసరాలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .అత్యవసర సమయంలో తక్షణం స్పందించేలా విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా హెచ్ డీపీపీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో కలసి కల్యాణ వేదిక, తదితర పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.






మహిమాన్వితం...

మంగళాద్రి నృసింహుని క్షేత్రం

- దక్షిణ భారతదేశంలోనే ఎత్తైన గాలి గోపురం
- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- నేటి రాత్రి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు
- రేపు మధ్యాహ్నం స్వామి వారి దివ్య రథోత్సవం
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



మంగళగిరి : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారు దిగువ సన్నిధిలో వేంచేసి ఉండగా.. శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి ఎగువ సన్నిధిలో వేంచేసి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఎగువ, దిగువ సన్నిధిలలో స్వామి వారిని దర్శించుకున్న భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం స్వామి వారు అని నమ్మకం. మంగళగిరి అనగానే గుర్తుకొచ్చేవి పానకాల స్వామి, గాలిగోపురం, చేనేత వస్త్రాలు. మంగళగిరిలో మూడు నరసింహ ఆలయాలున్నాయి. కొండ దిగువున శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండపై పానకాల స్వామి ఆలయం, కొండ శిఖరం మీద గుండాల నరసింహ స్వామి ఆలయాలున్నాయి. నాలుగు వైపులా గాలి గోపురాలున్నా... తూర్పున గాలిగోపురం నిర్మాణ శైలి వల్ల ప్రసిద్ధికెక్కింది. మొదట విజయనగర రాజులు ఈ గోపురం నిర్మాణం చేపట్టి 3 అంతస్తులు నిర్మించారు. తర్వాత కాలంలో అక్కడి జమీందారు రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు క్రీ.శ.1807–1809లో ఈ గోపురంపై 8 అంతస్తులు నిర్మించారు. 153 అడుగులు ఎత్తు ఉన్న ఈ గోపురం 49 అడుగులు వెడల్పు ఉంది. వెడల్పు తక్కువగా ఉండి ఎత్తు ఎక్కువగా ఉండడంతో ఈ గోపురం దక్షిణ భారతదేశంలో పేరొందింది.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఫాల్గుణ మాసంలో 11 రోజుల పాటు జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఇక్కడ ప్రసిద్ధి. ఫాల్గుణ శుద్ధ షష్టినాడు ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలలో చతుర్దశి నాడు శాంత నరసింహస్వామికి శ్రీదేవి, భూదేవిలతో కల్యాణం జరుగుతుంది. ఈ నెల 13వ తేదీన ఆలయం వద్ద ఉన్న స్వామి కల్యాణ మైదానంలో మహోత్సవం ఘనంగా జరగనుంది. అర్ధరాత్రి 12 గంటలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహోత్సవాన్ని తిలకిస్తారు. మరునాడు పౌర్ణమి రోజు 14వ తేదీ మధ్యాహ్నం స్వామి దివ్య రథోత్సవం జరుగనుంది. లక్షకుపైగా మంది భక్తులు ఉత్సవంలో పాల్గొంటారు. స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతారు.

స్వామి వారి దర్శన సమయాలు

కొండపై పానకాల స్వామి ఆలయం ఉదయం 7 నుంచి సాయంత్రం 3 గంటల వరకు తెరిచి ఉంటుంది. సాయంత్రం సమయంలో దేవతలు, రుషులు స్వామిని సేవించడానికి, మౌన వ్రత పూజలు చేయడానికి వస్తారని భక్తుల నమ్మకం. అందుకే ఆలయాన్ని మూడు గంటలకే మూసివేస్తారు. కొండ దిగువన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30, సాయంత్రం 4



నుంచి రాత్రి 8.30 గంటల వరకు తెరిచి ఉంటుంది. విజయవాడ నుంచి గుంటూరు రహదారిలో విజయవాడకు దాదాపు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంగళగిరి చేరుకోవడానికి రైలు, రోడ్డు మార్గాలున్నాయి. గుంటూరు, తెనాలి, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి చేరుకునేందుకు నిత్యం రవాణా సౌకర్యం కలదు. భక్తులకు మధ్యాహ్నం భోజనం వసతి ఉంటుంది.

